

యానాదుకు బాసటగా నిలవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

తణుకు యానాది కుటుంబాలకు అధికారులు మౌలిక వసతుల కల్పించి బాసటగా నిలవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ తణుకులో నివాసముంటున్న యానాది కుటుంబాలకు ఆధార్, రేషన్ కార్డులు జారీ, విద్య, వైద్యం, గృహాల ఏర్పాటుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. తణుకులో 19 యానాది కుటుంబాలకు సంబంధించి 66 మంది రోడ్డు పక్కన నివసిస్తున్నారన్నారు. వారికి ఆధార్, రేషన్ కార్డుల జారీకి చర్యలు చేపట్టాలన్నారు. టిడ్కో గృహాల కేటాయింపునకు పరిశీలించాలని తణుకు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. వారిలో గర్భిణులు ఉన్నారని వారికి వైద్య పరీక్షలు చేసి, మందులు ఇప్పించి, వారిని ముందుగానే ఆసుపత్రిలో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని డిఎంఅండ్‌హెచ్ఒను ఆదేశించారు. సమావేశంలో జిల్లా జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారి కెసిహెచ్ అప్పారావు, డిఎంఅండ్‌హెచ్ఒ మహేశ్వరరావు, స్త్రీ, శిశు సంక్షేమ అధికారి బి.సుజాతరాణి పాల్గొన్నారు.

మిల్లర్ల దోపిడీ ఆగేనా..!



'కొత్తూరుకు చెందిన పల్లపోతుల రెడ్డియ్య ఖరీఫ్‌లో ఏడెకరాల్లో వరి సాగు చేశాడు. 280 బస్తాల వరకూ రైతుభరోసా కేంద్రాల ద్వారా విక్రయించాడు. జట్టు, కిరాయిల నుంచి ఎన్నో ఇబ్బందులు పడి కేటాయించిన మిల్లుకు ధాన్యం తోలాడు. రైతుభరోసా కేంద్రం సిబ్బంది వద్ద తేమశాతం 16.7 రాగా, మిల్లు వద్ద 17.2 వచ్చిందని చెప్పారు. పాయింట్‌కు రూ. పది చొప్పన సొమ్ము రైతుల వద్ద నుంచి వసూలు చేశారు. తూకంలో తేడా వచ్చిందని కిలోకు రూ.20 వసూలు చేశారు. మొత్తంగా రూ.13,600 చెల్లిస్తే తప్ప ధాన్యం దింపుకోని పరిస్థితి కొనసాగింది.'

'కన్నెగంటి పూర్ణచంద్రరావుది కొత్తూరు గ్రామం. ఖరీఫ్‌లో ఏడెకరాలు సాగు చేశాడు. మొత్తం 205 బస్తాల ధాన్యం వరకూ విక్రయించాడు. మిల్లుకు వెళ్లిన తర్వాత బియ్యం ముక్క అవుతుందని బస్తాకు రూ.30 చొప్పన 180 బస్తాలకు డబ్బు కట్టించుకున్నారు. డబ్బు కట్టకపోతే ధాన్యం తీసుకునే పరిస్థితి లేకపోవడంతో అప్పు చేసి సొమ్ము చెల్లించారు.'

- ఖరీఫ్ ధాన్యం అమ్మకాల్లో తీవ్రంగా నష్టపోయిన రైతులు
- ముప్పతిప్పలు పెట్టిన మిల్లర్లు.. ఎదరు డబ్బు చెల్లించిన అన్నదాత
- తేమ, తూకం తదితర సమస్యలతో రైతన్న ఉక్కిరిబిక్కిరి
- రబీ పంట పరిస్థితిపై ఆందోళనలో అన్నదాత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న పల్లపోతుల రెడ్డియ్య, పూర్ణచంద్రరావులే కాదు. గడిచిన ఖరీఫ్‌లో ధాన్యం విక్రయించిన మూడొంతుల మంది రైతులు ఇదేవిధంగా ముందుగా మిల్లర్లకు డబ్బు చెల్లించి ధాన్యం అమ్ముకోవాల్సిన దుస్థితి రెండు జిల్లాల్లోనూ కొనసాగింది. నూతన ధాన్యం కొనుగోలు విధానంలో రైతులు పడ్డ కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. రెండు జిల్లాలవ్యాప్తంగా ఖరీఫ్‌లో దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఏలూరు జిల్లాలో 3.79 లక్షల టన్నుల ధాన్యం, పశ్చిమగోదావరి జిల్లాలో 3.76 లక్షల టన్నుల ధాన్యం రైతులు విక్రయించారు. ఖరీఫ్ ధాన్యం అమ్ముకునేందుకు రైతులు అడుగడుగునా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. పంట మాసూళ్లు చేసిన తర్వాత రైతుభరోసా కేంద్రం వద్దకు వెళ్లి ఆన్‌లైన్ చేసుకోవడం, గోనె సంచులు సరిగా ఇవ్వకపోవడం, వారం, పది రోజులపాటు లారీలో రాకపోవడం, తేమశాతం, తూకం వంటి సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మిల్లర్లు రైతులను ముప్పుతిప్పలు పెట్టారు. రైతుభరోసా కేంద్రం అధికారులు నిబంధలనకు అనుగుణంగా తేమ 17 శాతం ఉందని నిర్ధారించేవారు. తీరా మిల్లు వద్దకు వెళ్లాక తేమశాతం 18, 19 ఉందంటూ పాయింట్‌కు రూ.పది చొప్పున రైతుల నుంచి డబ్బు వసూలు చేసేవారు. డబ్బు ఫోన్‌పే చేస్తేనే లారీలో ధాన్యం దింపుకునేవారు. లేకపోతే ఎన్ని రోజులైనా లారీలో ధాన్యం అలానే ఉంచేసేవారు. అధికారులు నిర్ణయించిన వేబ్రిడ్జి వద్ద తూకం సరిగా వచ్చినప్పటికీ మిల్లు వద్ద తూకం తగ్గిందని కిలోకు రూ.20 వసూలు చేశారు. ధాన్యం విక్రయించిన ప్రతి రైతూ డబ్బు ఎదురు చెల్లించాల్సి వచ్చేది. ధాన్యం కిరాయి రూ.రెండు వేలకు మాట్లాడితే మిల్లు వద్ద ధాన్యం తీసుకెళ్లిన లారీ, ట్రాక్టర్ ఒకరోజు అదనంగా ఉంటే మరో రూ.రెండు వేలు కిరాయి చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ధాన్యం పొలంలో నుంచి గట్టుమీదకు, అక్కడి నుంచి మిల్లుకు ఇలా రెండుసార్లు ఎగుమతి, దిగుమతి పేరుతో అదనంగా ఖర్చు చేయాల్సి పరిస్థితి వచ్చింది. ధాన్యం సొమ్ము 21 రోజులకు చెల్లించాల్సి ఉండగా నెలలు తరబడి చెల్లించని దుస్థితి కొనసాగింది. ఎదురు డబ్బు చెల్లించి ధాన్యం అమ్ముకోవడం ఏమిటని రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. రబీలోనూ ఇదే విధానం కొనసాగితే పరిస్థితి ఏమిటనే ఆందోళన అన్నదాతను వెంటాడుతోంది. నూతన కొనుగోలు విధానంలో సమస్యలను పరిష్కరించి రబీలో ధాన్యం కొనుగోలు చేయకపోతే సాగు చేయడం ఇక మానుకోవాల్సిందేననే చర్చ రైతుల్లో నడుస్తోంది. ధాన్యం కొనుగోలు విధానంలో మిల్లర్ల దోపిడీని అరికట్టకపోతే రబీలోనూ రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడనుంది. ప్రభుత్వం రబీలో ధాన్యం కొనుగోలులో ఎటువంటి చర్యలు చేపడుతుందో వేచిచూడాలి.

అభివృద్ధి ఆచరణలో చూపాలి

మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

ప్రజాశక్తి - భీమవరం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

పట్టణాల అభివృద్ధి మాటల్లో కాకుండా ఆచరణలో చేసి చూపించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ముఖ్యంగా జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో వాయు కాలుష్య నియంత్రణకు పెద్ద ఎత్తున చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ వాయు కాలుష్య నియంత్రణ చర్యలపై జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మాటలు ఆచరణలోకి మారితేనే చేసిన పని కనిపిస్తుందన్నారు. మాటలు కార్యాచరణ దాటడం లేదని, ప్రయోజోపకరమైన పనుల్లో నిర్లక్ష్య ధోరణి సరికాదన్నారు. భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం పట్టణాల్లో దుమ్ము, ధూళి ఎక్కువగా గాలిలోకి లేస్తోందన్నారు. ఈ రెండు నెలల కాలంలోనే సాధ్యమైనంత ఎక్కువ నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. వాయు కాలుష్యం నియంత్రణకు జిల్లాలోని అన్ని పట్టణ ప్రాంతాల్లో చెత్తను తగలపెట్టకుండా చూడటం, చెత్తను, ప్లాస్టిక్ పదార్థాలను వేరు చేసి తరలించడం, రోడ్డు మార్జిన్లలో దుమ్ము లేవకుండా పేవర్ బ్లాక్స్‌ను ఏర్పాటు చేయడం, రోడ్డు మార్జిన్లలో, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటడం తదితర చర్యలను వెంటనే చేపట్టాలన్నారు. భవనాలను పడగొట్టే సందర్భాల్లో యజమానులు తప్పనిసరిగా సంబంధిత సచివాలయానికి సమాచారాన్ని అందించాలన్నారు. స్మశానవాటికల్లో క్రిమేషన్‌ను విద్యుత్ లేదా గ్యాస్‌తో చేపట్టేందుకు అవసరమైన యంత్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలను వెంటనే పంపాలన్నారు. రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్, స్వచ్ఛంద సంస్థలు, అసోసియేషన్‌లకు మొక్కలు నాటే బాధ్యతలను అప్పగించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఏలూరు నుంచి పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇఇ వెంకటేశ్వర్లు, భీమవరం కలెక్టరేట్ నుంచి ఎంవిఐకెఎస్ఎన్.ప్రసాద్, పరిశ్రమ శాఖ ఐపిఒ జె.శ్రీపతి, తణుకు మున్సిపల్ కమిషనర్ కెటి.సుధాకర్ పాల్గొన్నారు.



కాళ్లకూరు జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలన్

గ్యాస్ ధర పెంపునకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి - ఆచంట



గ్యాస్ సిలిండర్ నెత్తిన పెట్టుకొని నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలంతా ఐక్యంగా పెద్దఎత్తున పోరాటం చేయాలని సిపిఎం మండల కమిటీ సభ్యులు సిర్రా నర్సింహమూర్తి, పి.మోహనరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచిన గ్యాస్ ధరలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని ఆచంట, పెనుమంచిలి, వల్లూరు గ్రామాల్లో గ్యాస్ బండలు నెత్తిన పెట్టుకొని నిరసన తెలిపారు. సంతమార్కెట్ వీధి, రామేశ్వరస్వామి సత్రం మీదుగా ఆచంట కచేరీ సెంటర్ వరకూ గ్యాస్ బండలను నెత్తిన ధరించి భారీర్యాలీ నిర్వహించారు. సెంటర్‌లో జరిగిన సభకు మండల కమిటీ సభ్యులు ఎస్‌విఎన్ శర్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ ధర రూ.50, వాణిజ్య సిలిండర్ ధ రూ.350 పెంచడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం సబ్సిడీ జమను రెండు సంవత్సరాల నుండి నిలిపివేసిందన్నారు. ఇప్పటికే గృహ వినియోగానికి సబ్సిడీ కింద ఇచ్చే సిలిండర్ల సంఖ్యను కుదించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్రంలో రాజకీయ పార్టీలతోపాటు ప్రజలంతా కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ చర్యలపై తిరగబడాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించుకునే వరకూ ప్రజా పోరాటాలు చేస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు వద్దిపర్తి అంజిబాబు, ఇంజేటి వీరయ్య, సీనియర్ నాయకులు తోటపల్లి సత్యన్నారాయణ, ఇందుకూరి సూర్యనారాయణ రాజు, బొర్రా ధర్మారావు, సిర్రా విఘ్నేశ్వరరావు, టి.దుర్గాప్రసాద్, కేతా భవానీశంకర్, మానుకొండ రాంబాబు, పిల్లి శ్రీరాములు, తాళం సుబ్బారావు, దాసరి తిరుపతిరావు, దాసరి కీర్తిశ్రీ, పార్శి సత్యవతి, మానుకొండ నర్సింహమూర్తి, పైడి సత్యన్నారాయణ, నిమ్మకాయల చంద్రరావు, బొర్రా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

జగనన్న లేఅవుట్లలో సిపిఎం బృందం పరిశీలన

ప్రజాశక్తి - కాళ్ల

జగనన్న గృహ లబ్ధిదారుల పరిస్థితి దయనీయంగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. ఏలూరుపాడు, కాళ్లకూరు, కాళ్ల, కొలనపల్లి గ్రామాల్లోని జగనన్న లేఅవుట్లను శుక్రవారం సిపిఎం నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు పలు సమస్యలను సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఊరికి దూరంగా సెంటున్నర స్థలం ఇచ్చి, అరకొరగా పూడిక చేసి, ఇల్లు కట్టుకోకపోతే స్థలాలను వెనక్కి తీసుకుంటామని అధికారులు బెదిరించడం సరికాదన్నారు. ఒక పక్క అధికారుల బెదిరింపులు తాళలేక, మరోపక్క ఇళ్లు నిర్మించుకోలేక లబ్ధిదారులు సతమతమవుతున్నారన్నారు. ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని, లేనిపక్షంలో ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా కనీసం పూడిక చేయకపోవడం దుర్మార్గమన్నారు. గ్రామానికి దూరంగా నివాసయోగ్యం లేనిచోట లేఅవుట్ ఏర్పాటుచేసి ఇళ్ల స్థలాలు అందజేయడం దారుణమన్నారు. తక్షణం ప్రభుత్వం ఇంటిని నిర్మించి ఇవ్వాలని, లేనిపక్షంలో రూ.6 లక్షలు ఇంటి నిర్మాణం నిమిత్తం లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ, సిపిఎం మండల కమిటీ తిరుమాని శ్రీనివాస్, మోకా కోటేశ్వరరావు, ఏసురత్నం పాల్గొన్నారు.

భవిష్యత్ అంతా గ్రీన్ ఎనర్జీ దే

ఎపి నిట్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి సందీప్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



విద్యార్థులతో మాట్లాడుతున్న సందీప్

భవిష్యత్తు అంతా గ్రీన్ ఎనర్జీదేనని ఎపి నిట్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వి.సందీప్ సూచించారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో రాజమండ్రిలోని ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయానికి చెందిన 40 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు శుక్రవారం నిట్ కళాశాలను సందర్శించారు. సంస్థలోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఎలక్ట్రికల్ మిషన్ ప్రయోగశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ వాతావరణంలో రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వాలు ఎలక్ట్రికల్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయన్నారు. అందుకు తగ్గట్టుగానే కంపెనీలు విస్తృత పరిశోధనలు చేసి రకరకాలు మోడల్స్ తోకూడిన ఎలక్ట్రికల్ వాహనాలను మార్కెట్‌లోకి తీసుకొస్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం రెట్టింపు కానున్నాయన్నారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేసి సామాన్య ప్రజానీకానికి అనువుగా ఉండేలా నూతన ఎలక్ట్రికల్ వాహనాలు, పరికరాల తయారీపై దృష్టి సారించాలన్నారు. భారత్‌ను అత్యంత ప్రతిభావంతమైన దేశంగా తీర్చిదిద్దడానికి యువతరం కషి చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో నన్నయ్య విశ్వ విద్యాలయం సహాయ ఆచార్యులు డాక్టర్ డి.కిషోర్, డాక్టర్ జి.కీర్తి పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం పెట్టాలి

సిఎండిఒ జిల్లా సమన్వయకర్త కె.కృష్ణారావు

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతి విద్యార్థికీ నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని సిఎండిఒ జిల్లా సమన్వయకర్త కె.కృష్ణారావు అన్నారు. శృంగవృక్షం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రతి విద్యార్థీ మధ్యాహ్న భోజనం చేసేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. నాణ్యత బాగున్నప్పుడే విద్యార్థులు భోజనం చేయడానికి ఇష్టపడతారన్నారు. ఆయన వెంట ఎంఇఒ పి.రామలక్ష్మణమూర్తి, ప్రధానోపాధ్యాయుడు టి. కాశీజనార్ధనరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

మహిళలను గౌరవించాలి : డిఆర్ఒ

ప్రజాశక్తి - భీమవరం రూరల్



డిఆర్ఒ కృష్ణవేణిని సత్కరిస్తున్న సభ్యులు

ఆధునిక కాలంలో మహిళ అబల కాదు సబలగా మారిందని, మహిళలను గౌరవించే ప్రాంతాలు అభివృద్ధి పథంలో ఉంటాయని డిఆర్ఒ కృష్ణవేణి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పాస్తుల సాగరం మున్సిపల్ హైస్కూల్లో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను డిఆర్ఒ కృష్ణవేణి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇంటికే పరిమితమైన మహిళలు నేటి సమాజంలో విద్య, వైద్య సామాజిక, కళా రంగంలో ముందుంజలో ఉంటున్నారన్నారు. పురుషులకు దీటుగా అన్ని రంగాల్లోనూ మహిళలు రాణిస్తున్నారన్నారు. హెచ్ఎం కోడె వెంకట్రావు మాట్లాడుతూ మూడున్నర దశాబ్దాలుగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మహిళలను గౌరవించాలన్నారు. లయన్స్ క్లబ్ నాయకులు కంతేటి వెంకటరాజు, స్కూల్ ఉపాధ్యాయినులు మాట్లాడారు. అనంతరం డిఆర్ఒ కృష్ణవేణిని సత్కరించారు. మహిళా సాధికారిత ర్యాలీ నిర్వహించారు.

రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



మాట్లాడుతున్న యూనియన్ నేతలు

తాడేపల్లిగూడెం రైల్వేగూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం శుక్రవారం యూనియన్ అధ్యక్షులు కోదండరామి రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలిండియా రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కార్యదర్శి డి.రమేష్ బాబు, రైల్వే వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి డివిఎన్ నరసింహులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశంలో 900లకు పైగా రైల్వేగూడ్స్ షెడ్లలో 340 గూడ్స్ షెడ్లను ప్రయివేటీకరించేందుకు అడుగులు వేస్తోందన్నారు. అనేక సంవత్సరాలుగా గూడ్స్ షెడ్లలో పని చేస్తున్న కార్మికులకు సరైన సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దేశ వ్యాప్తంగా రైల్వేలో పని చేస్తున్న అన్ని రంగాల కార్మికులకూ గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్ మొదలగు సంక్షేమ పథకాలు అమలుకోసం పోరాడాలన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు కర్రి నాగేశ్వరరావు, శిరపరపు రంగారావు, కరెడ్ల రామకృష్ణ, చిర్ల పుల్లారెడ్డి, ఎస్‌విఎస్ రెడ్డి, కర్రి సాయి రెడ్డి, కఇ సుబ్బిరెడ్డి, అడపా ఆంజనేయులు, ఆకుల నారాయణ, మద్దాల పుత్రయ్య, దాడి వెంకట్రావు, యండ్రపు కృష్ణ, బుద్దాల నాని, అడ్డగర్ల కృష్ణ పాల్గొని మాట్లాడారు.



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

ప్రజా సంక్షేమమే ధ్యేయం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పెనుగొండ

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సిద్ధాంతం గ్రామంలోని లక్కపేట, అరుంధతిపేటలో 141 రోజు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇంటింటా సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంబిసి కార్పొరేషన్ ఛైర్మన్ వీరన్న, జెడ్‌పిటిసి గోవర్ధన్, సర్పంచి చింతపల్ల గన్నిరాజు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

జగన్‌ను ఎదుర్కొనేది జనసేనే

రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



మృతుని కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మనోహర్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనను ఎదుర్కొనే సత్తా జనసేనకే ఉందని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన తాడేపల్లిగూడెం విచ్చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశానికి జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం దారుణంగా అణచివేస్తోందని విమర్శించారు. రాజకీయ కార్యకలాపాలు చేయడానికి భయపడే వాతావరణం రాష్ట్రంలో ఏర్పడిందన్నారు. నిజాయితీ పరుడైన పవన్‌కళ్యాణ్‌ను ముఖ్యమంత్రిని చేయాలంటే కేవలం నినాదాలుచేస్తే సరిపోదని, సమగ్ర ప్రణాళికతో పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం నాదెండ్ల మనోహర్‌ను గజమాలతో సత్కరించారు. అలాగే ఇటీవల మరణించిన జనసేన కార్యకర్తల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.5 లక్షల చొప్పున చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, జనసేన పిఎసి సభ్యులు కనకరాజు సూరి, ఏలూరు ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు, పోలవరం ఇన్‌ఛార్జి చెగ్రీ బాలరాజు, రాష్ట్ర కార్యదర్శులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను అరికట్టాలి

జిల్లా ఎస్‌పికి డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నేతల వినతి

ప్రజాశక్తి - భీమవరం



జిల్లా ఎస్‌పికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నేతలు

జిల్లాలో మాదకద్రవ్యాలను అరికట్టాలని జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్‌కు శుక్రవారం డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలుగా మారి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు భవిష్యత్తులో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రముఖులు, వైద్యులతో అవగాహనా సదస్సులు నిర్వహించనున్నమన్నారు. దీనికి పోలీస్ శాఖ నుంచి తోడ్పాటు అందించాలని కోరారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో జరిగిన అత్యాచారాలకు నేరాలకు మూల కారణం మత్తు పదార్థాల వినియోగమే అన్నారు. స్పందించిన జిల్లా ఎస్‌పి రవిప్రకాష్ మాట్లాడుతూ జిల్లాలో అనేక చోట్ల మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పలు విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ పేరుతో కమిటీలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో డ్రగ్స్ సరఫరాకు, వినియోగానికి అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. విద్యార్థి, యువకుల భవిష్యత్తును కాపాడడానికి డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ చేస్తున్న కృషిని అభినందించారు.

వంద మందికి వినికిడి పరీక్షలు

ప్రజాశక్తి - భీమవరంరూరల్

పది అడుగుల దూరంలో ఉన్న మాటలు, శబ్దాలు వినబడకపోతే వినికిడి లోపం ఉన్నట్లేనని, వెంటనే వైద్యులను సంప్రదించాలని ప్రముఖ వినికిడి వైద్యులు కె.దుర్గాప్రసాద్ అన్నారు. ప్రపంచ హియరింగ్ డే సందర్భంగా జెపి రోడ్డులోని తేజ హియరింగ్ క్లినిక్‌లో ఉచిత వినికిడి పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 100 మందికి ఉచితంగా వినికిడి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ కచ్చితంగా 6 నెలలకు ఒక్కసారైనా వినికిడి పరీక్షలు చేయించుకోవాలన్నారు. 30 రోజులపాటు ఉచిత వినికిడి పరీక్షల మెగా క్యాంప్‌ను నిర్వహిస్తున్నామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చెస్ ఛాంపియన్ షిప్ పోటీలకు..
ఎస్‌ఆర్‌కెఆర్ విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ చెన్నయ్‌లో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు చెప్పారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ పి.సత్యనారాయణ రాజు మాట్లాడుతూ సౌత్‌జోన్ చెస్ పోటీలకు జెఎన్‌టియుకె తరపున ఆరుగురు విద్యార్థులు ఎంపికగా అందులో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు బి.ధార్మిక్, పి.శ్రీరామ్ కార్తీక్, కెఎస్ఎస్ హర్ష ఎంపికైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ జి.హరి మోహన్ పాల్గొన్నారు.

హెచ్‌ఐవి బాధితులకు మానవత సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఆపన్నులకు సాయం చేయడంలో ఎంతో తృప్తి ఉంటుందని ప్రముఖ వాణిజ్యవేత్త, దాత కామిశెట్టి అయ్యప్ప నాయుడు అన్నారు. పాలకొల్లు మానవత తరపున 20 మంది హెచ్‌ఐవి బాధిత పిల్లలకు 8 వేల రూపాయల విలువైన పౌష్టికాహారం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలోని కొత్తపేట అర్బన్ హెల్త్ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి షేక్ పీర్ సాహెబ్, ఛైర్మన్ ముత్యాల రామారావు, ఉపాధ్యక్షుడు ధనాని సూర్యప్రకాష్, బొక్కా రమాకాంత్, ముత్యాల కుమారి పాల్గొన్నారు.


ఎంఎల్‌సి అభ్యర్థులు వంక రవీంద్రనాథ్, కౌరు శ్రీనివాసును సన్మానిస్తున్న వైసిపి నాయకులు

'కవురు, వంక గెలుపు ఖాయం'

ప్రజాశక్తి - ఆచంట

స్థానిక సంస్థల శాసన మండలి సభ్యుల ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులు వంక రవీంద్రనాథ్, కవురు శ్రీనివాసులు గెలుపు ఖాయమని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ అన్నారు. ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆచంట వైసిపి కార్యాలయానికి విచ్చేసిన వంక రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్‌ను కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచంట సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, ఎంపిటిసి ఉల్లాం జ్యోతి రామానుజం, తప్పెట్ల విజయ కుమారి వెంకటరావు, గ్రామ అధ్యక్షులు పెచ్చెటి సత్యనారాయణ, మనవర్థి విజయ్ పాల్గొన్నారు.

17, 18 తేదీల్లో జాతీయస్థాయి విద్యార్థి సింపోజియం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 17, 18 తేదీల్లో ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐఎస్‌టిఇ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో 'నిపుణ 23' పేరిట జాతీయస్థాయి విద్యార్థి సింపోజియం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.జగపతిరాజు చెప్పారు. దీనికి సంబంధించి పోస్టర్‌ను శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్‌ఆర్‌కె నిషాంత్ వర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిపుణ ఫ్యాకల్టీ అడ్వయిజర్ ప్రొఫెసర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులకు రెండు రోజులపాటు 17 రకాల ఈవెంట్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఛైర్ పర్సన్ కె.హర్షవర్ధన్, కెజెఎస్ ధర్మశ్రీ, ఎన్.శశాంక్, కె.పవన్, ఎన్.చక్రవర్తి పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపును ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.50, వాణిజ్య సిలిండర్ రూ.350 పెంచడాన్ని సిపిఐ(ఎం) జిల్లా సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు తీవ్రంగా ఖండించారు. పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు ఎక్కడికక్కడ నిరసనలు వ్యక్తం చేస్తున్నారని, ప్రభుత్వం గుర్తించి పెంపుదల నిర్ణయం తక్షణం వెనక్కి తీసుకోవాలని ఆయన కోరారు. గ్యాస్ బండ ధర పెంపుపై జనసేన వ్యతిరేకించాలని, రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షం టిడిపి స్పందించాలని బాబూరావు కోరారు.

పాలకొల్లులో అన్నసమారాధన

ప్రజాశక్తి - పాలకొల్లు

కనకదుర్గ మల్లేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ ఆలయాల ఛైర్మన్లు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ కావలి శ్రీనివాస్, క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయ ఛైర్మన్ గాదె వెంకన్న, జోగి వెంకటేశ్వరరావు, కెళ్లా పెద్దిరాజు, ఇఒ సతీష్ పాల్గొన్నారు.

9న పలు గ్రామాల్లో సమావేశాలు

ప్రజాశక్తి - ఆచంట


ప్రతి నెలా తొమ్మిదో తేదీన పెనుమంట్ర మండలంలోని పొలమూరు, గరువు, పెనుమంట్ర, మాముడూరు గ్రామాల పార్టీ సమావేశం నిర్వహించనున్నట్లు చేస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాసరెడ్డి (బుల్లాలు) తెలిపారు. పొలమూరులో ఉదయం 11 గంటలకు, మాముడూరులో 12 గంటలకు, పెనుమంట్రంటలో మధ్యాహ్నం మూడు గంటలకు, గరువు గ్రామంలో సాయంత్రం నాలుగు గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, టిడిపి పొలిటికల్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలో నాయకులు, మండలంలోని క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్లు, మండల కమిటీ, అనుబంధ కమిటీలు ఆయా గ్రామ కమిటీలు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

జుత్తిగ నాగరాజుకు చినబాబు అభినందన

ప్రజాశక్తి - ఉండి

జనసేన సభ్యత్వ నమోదులో ప్రథమ స్థానం సాధించిన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజును జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు (చినబాబు) అభినందించారు. ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పార్టీని బలోపేతం చేయడంలో జుత్తిగ నాగరాజు పాత్ర అమోఘమైందని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలోని పార్టీ మండల అధ్యక్షులు, వాలంటీర్ల సమన్వయంతో ఆరు వేలకు పైగా సభ్యత్వాలు నమోదు చేసి జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించామన్నారు. సభ్యత్వ నమోదులో తనకు సహకరించిన మండల అధ్యక్షులకు, వాలంటీర్లకు ధన్యవాదాలు తెలిపారు.


సీసలిలో నెర్రలు తీసిన వరి పొలం


సీసలి కొత్త కాలువలో నీటి మట్టం

వంతు.. కష్టాల తంతు..!

శివారు పొలాలకు అందని సాగునీరు
చేపల చెరువులకు తోడేస్తున్న ఆక్వా రైతులు
నెర్రలు తీస్తున్న పొలాలు..
ఆందోళన చెందుతున్న రైతులు

ప్రజాశక్తి - కాళ్ల

పశ్చిమగోదావరికి ధాన్యాగారమని పేరు. గోదావరి జలాలతో, పచ్చని పైర్లతో కళకళలాడే జిల్లాలో నేడు రబీకి సాగునీరందని పరిస్థితి నెలకొంది. దీంతో శివారు పొలాలు నెర్రలు తీస్తున్నాయి. అయితే రబీకి పూర్తిస్థాయిలో సాగు నీరందిస్తాం.. గోదావరిలో సాగుకు సరిపడా నీటిమట్టం లేదు. అయినా సీలేరు జలాలు తరలించి సాగునీరందిస్తామని అధికారులు ఆర్భాటపు కబుర్లు చెప్పి చేతులు దులుపుకున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతుల వారీ విధానం అమలు చేస్తున్నా తమ పొలాలకు నీరందక బీటలు వారుతున్నాయని వాపోతున్నారు. ప్రస్తుతం వరి చేలు పిలకలు తొడిగే, పొట్ట దశకు చేరుకున్నాయని, సాగునీరందించాలని కోరుతున్నారు..

తగ్గిన నీటిమట్టం..

వంతుల వారీ విధానంలో పంట కాలవలు, బోదెల్లో నీటిమట్టం తగ్గడంతో ఆయిల్ ఇంజిన్ల సాయంతో నీటిని తోడుకుంటూ రైతులు నానా తంటాలు పడుతున్నారు. వరి చేలకు చేరాల్సిన నీరు చేపలు, రొయ్యల చెరువులకు మళ్లిస్తున్నారని, దీంతో తమ పొలాలు నెర్రలు తీస్తున్నాయని రైతు, కౌలు రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఎగువన ఆయిల్ ఇంజిన్లు వేసి నీటిని తోడేయడం వల్ల సాగునీటి ఎద్దడి నెలకొంది.

ఇటీవల సాగునీటి సమస్య పరిష్కరించాలని కాళ్ల గ్రామ రైతులు వరి దుబ్బులతో ధర్నా నిర్వహించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పర్యటించి సాగునీటిని అందించే బాధ్యత ఇరిగేషన్ అధికారులకు అప్పగించారు. అయితే కాళ్ల, దొడ్డనపూడి, సీసలి గ్రామ రైతులకు సాగునీరందించేందుకు ఇరిగేషన్ అధికారులు తలమునకలవుతున్నారు. వంతుల వారీ విధానం ఉండడంతో పొలం గట్లపైనే రైతులు పడిగాపులు కాస్తున్నాయి. వంతుల వారీ విధానం అమల్లో ఉన్నా ఎగువన తోడేయడంతో మెరక ప్రాంత భూములకు సాగు నీరు అందడం లేదు.

500 ఎకరాల్లో సాగునీటి ఎద్దడి..

కాళ్లలంక, కోలనపల్లి, కోమటిగుంట, సీసలి, ఏలూరుపాడు, కాళ్లకూరు, దొడ్డనపూడి గ్రామాల శివారు, మెరక భూముల్లో సుమారు 500 ఎకరాల్లో సాగునీటి ఎద్దడి నెలకొంది. ప్రస్తుతం వరిచేను పిలకల తొడిగే దశలో ఉండడంతో సాగునీటి కోసం రైతులు నానా పాట్లు పడుతున్నారు. ఆక్వా చెరువులకు నీటిని మళ్లించడంతో శివారు ప్రాంతాలకు అందని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్తిస్థాయిలో సాగునీరందించాలి..

కట్రెడ్డి వీరాస్వామి, రైతు, సీసలి

సీసలి కొత్త కాలువకు వంతుల వారీ విధానంలో పూర్తిస్థాయిలో నీరందించాలి. సాగునీరందక పొలాలు నెర్రలు తీశాయి. వంతులో నీటిని అందించలేని పక్షంలో చేను ఎండిపోతోంది. పంటపై ఆశ వదులు కోవాల్సిందే. ఇప్పటికైనా అధికారులు స్పందించి శివారు, మెరక భూములకు సాగునీరందించాలి.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

వివిధ సమస్యలపై ఏప్రిల్ 5న నిర్వహించబోయే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. పాలకోడేరు సిఐటియు, ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం చలో ఢిల్లీ సన్నాహక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు మండల కార్యదర్శి వైఎస్ఎన్.మూర్తి అధ్యక్షత వహించగా సత్యనారాయణ మాట్లాడారు. దేశవ్యాప్తంగా రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, సిఐటియు ట్రేడ్ యూనియన్లు కలిసి దాదాపు 5 లక్షల మందిపైగా చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనున్నారని చెప్పారు. బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్వతంత్రం రాకముందు సాధించుకున్న కార్మిక చట్టాలను, రైతు వ్యవసాయ కార్మిక చట్టాలను మార్చి యాజమాన్యులకు, కార్పొరేటర్లకు అనుకూలంగా చట్టాలను తీసుకొచ్చిందని విమర్శించారు. ఈ చట్టాలు కార్మికులకు నష్టాలు చేకూర్చే విధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలపై అనేకసార్లు పోరాటాలు, ఆందోళనలు చేసినట్లు తెలిపారు. సమస్యలపై ఏ రాజకీయ పార్టీ నోరు మెదకపోవడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను కరపత్రం ద్వారా ప్రజల్లో తీసుకెళ్లాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అశ్రియ్య, మరియమ్మ, కె.కళ్యాణి, ఎ.వెంకటలక్ష్మి, డి.శాలిని, జి.వెంకటేశ్వరరావు, చీరాల లక్ష్మి, మేరీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెక్కంశెట్టి సత్యనారాయణ

జాతీయ చేనేత ఐక్యవేదికలో పలువురి నియామకం

ప్రజాశక్తి - ఆచంట

జాతీయ చేనేత ఐక్యవేదికలో వివిధ స్థాయిలో పలువురిని నియమించినట్లు పెనుమంట్ర మండలం మార్టేరుకు చెందిన జాతీయ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్లాడ సూర్య భాస్కరరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. వీరిలో జాతీయ చేనేత జిల్లా అధ్యక్షులుగా గోరు మోహన్‌రావు, జిల్లా మహిళా అధ్యక్షురాలుగా చల్లా నాగమణి, ప్రధాన కార్యదర్శిగా ఎర్ర కాశీవిశ్వనాథం, ఉపాధ్యక్షులుగా తాళ్ల కుమారస్వామి, తాడేపల్లిగూడెం నియోజకవర్గ అధ్యక్షులుగా గుంపుల సురేష్, తణుకు నియోజకవర్గ అధ్యక్షులుగా పొన్న కనక లింగేశ్వరరావు, ఉండి నియోజకవర్గ అధ్యక్షులుగా శ్రీనివాసరావు, భీమవరం నియోజకవర్గ అధ్యక్షులుగా ఆనం పుల్లయ్య, నరసాపురం నియోజకవర్గ అధ్యక్షులుగా మాపూరి ఆనందకుమార్, పాలకొల్లు నియోజవర్గ అధ్యక్షులుగా కాలేపు చిట్టికాసులు, ఆచంట నియోజవర్గ అధ్యక్షులుగా అందే బసవగణపతిని నియమించినట్లు తెలిపారు.

సాగు నీరందించాలి : కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి - పోడూరు

వరిపంటకు పొట్ట దశలో సాగునీరు అందకపోవటంతో గుమ్ములూరు గ్రామ సివారు రాయప్పనగరంలో కౌలురైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు అన్నారు. సాగునీటి సమస్యపై ఆయన రైతులతో కలిసి శుక్రవారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పంటకు నష్టాలు చవిచూసిన కౌలు రైతులు దాళ్వా పంటపై కోటి ఆశలు పెట్టుకున్నారన్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.20 వేలు పైబడి పెట్టుబడి అప్పులు తెచ్చి పెట్టారన్నారు. తక్షణమే గుమ్ములూరు తూర్పు కాలువ నుంచి రాయప్ప నగర్ పెదపేట, రావిగొప్ప ప్రాంతాల్లో నీరులేక ఎండుతున్న వంద ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కౌలురైతులు గోగనమండ ఫిలిఫ్, గోగనమండ ఉదయ్ భాస్కరరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, రాపాక కనకరత్నం, గోగనమండ రామారావు, గోగనమండ రాజు, కలికితి సుందరరావు పాల్గొన్నారు.


పొలాలను పరిశీలిస్తున్న కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు

దోమల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అవసరం


మొగల్తూరులో డ్రైడే

ప్రజాశక్తి - పాలకోడేరు

దోమల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అవసరమని ఆరోగ్య సిబ్బంది పేర్కొన్నారు. పాలకోడేరు పిహెచ్‌సి వైద్యులు రంగమనాయుడు ఆదేశాల మేరకు ఆరోగ్య సిబ్బంది విస్సాకోడేరులో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి జ్వరాలపై సర్వే నిర్వహించారు. పోషకాహారంపై అవగాహన కల్పించారు. పంచాయతీ సరఫరా చేస్తున్న తాగునీటికి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కెఎ.శ్రీనివాస్, పి.నాగమణెమ్మ, కె.లలిత, టి.వాణి, గోపాలకృష్ణ, హేమ, భవాని పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరు పంచాయతీ పరిధి పెద్దపల్లవపాలెంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరి శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది కుక్కల సాంబశివరావు, వి.సునీత, ఆశా వర్కర్ బి.దేవి పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో ఉన్న క్షీరా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం నిత్యాన్నదాన ట్రస్టుకు పాలకొల్లుకు చెందిన కంచర్ల శ్యామ్ చందు రూ.10 వేల విరాళం శుక్రవారం అందించారు. వారి కుమార్తె నాగామృత పేరున ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాసరావుకు ఈ విరాళం అందించినట్లు ఆలయ ఇఒ యాళ్ల సూర్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ నరసింహ స్వామి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి - మొగల్తూరు


అమృత్ సరోవర్‌లో భాగంగా మొగల్తూరులో చేపట్టిన చెరువు పూడిక పనులను ఎంపిడిఒ ఆనంద్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ వై.శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ జవ్వాది వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

సచివాలయాల్లో భీమవరం డివిజనల్ అభివృద్ధి అధికారి కె.కిషోర్ కుమార్ తనిఖీలు

ప్రజాశక్తి - ఉండి

సచివాలయ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారికి మెరుగైన సేవలు అందించాలని భీమవరం డివిజనల్ అభివృద్ధి అధికారి కె.కిషోర్ కుమార్ సచివాలయ సిబ్బందికి సూచించారు. ఉండి పంచాయతీ పరిధిలోని 1, 2, 3, 4 సచివాలయాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ అధికారులు సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారికి మెరుగైన సేవలను అందించాలని సూచించారు. అధికారుల పనితీరును, గ్రామ ప్రజలకు సచివాలయాల్లో అందించే సేవలు, సిబ్బంది హాజరు వంటి వాటిని పరిశీలించారు. ఆయుష్మాన్ భారత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సచివాలయ పరిధిలో జగనన్న పెళ్లి కానుక వర్తించే వారి వివరాలను పూర్తిస్థాయిలో తెలుసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఆడబాల వెంకట అప్పారావు, గ్రామపంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాస్‌వర్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సచివాలయంలో తనిఖీ చేస్తున్న కె.కిషోర్‌కుమార్

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ఎస్ఐ బి.రాజు పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లిగూడెం శశి ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో వాహనదారులు, విద్యార్థులకు హెల్మెట్ ధరించడంపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడిపే విధంగా చర్యలు తీసుకున్నారు.